# అహమ్

- శ్రీపాద పావనరాం

శరీర, గుణ, వేష, భూషణలతో వున్న 'నేను' ని అహంకారం' 'అహంకృతి' అన్నారు.

'అహంకారం బలం దర్పం విముచ్య' అని గీతలో శ్రీకృష్ణభగవానుడు.

'తస్మాదహంకార మిమం స్వశత్రుమ్ భోక్తుర్గళే కణ్టక త్తప్రతీతమ్' (గొంతుకలో ముల్లట) - అని వివేకచూడామణిలో శంకరులు 'అహంకార గతే చ్చాద్వైర్దేహ వ్యాధ్యాధిభిస్తదా' - అని పంచదశిలో విద్యారణ్యులు.

అహం కారాన్ని దూదేకినట్లు ఏకేశి, ఉండరాని, ఉండకూడని 'కారం' అన్నారు. శ్రుతుల్లోనూ, స్మృతుల్లోనూ, ఇదే వరస. కాని నన్నడిగితే మనిషన్న వాడికి కాసింత అహంకారం ఉండాలంటాను.

అహం కారం అనగానే విశ్వనాథవారి పద్యం తళుక్కుమంటుంది చూడండి.

అల నన్నయకులేదు తిక్కనకు లేదా భోగమస్మాదృశుం
డలఘు స్వాదు రసావతారధిషణాహంకార సంభార దో
హల బ్రాహ్మీమయమూర్తి శిష్యుడయినాడన్నట్టిదావ్యోమపే
శల చాంద్రీ హృదుకీర్తి చెళ్ళపిళ వంశస్వామికున్నట్లుగన్

ఉట్టి అహంకారం కాదు భీషణాహంకారము. (తనంత శిష్యుడు....) దీన్ననుసరిస్తూ, ఆధునిక వైతాళికు లెవరో - 'అల రాయప్రోలుకు లేదు విశ్వనాథకు లేదా భోగ..' మంటూ ప్రారంభించి, యుగకర్తా, ప్రజాకవీ శ్రీ శ్రీ శిష్యుడయినా డన్నట్టిదా వ్యోమ పేశల చాంద్రీ హృదుకీర్తి అబ్బూరి వంశస్వామి కున్నట్లుగన్ ' అనే సన్నుతితో ముగించారట! (ఈయనంత గురువు ....) అబ్బూరి రామకృష్ణారావు గారు శ్రీ శ్రీ ని ప్రజాకవిగా మలిచారని జనశ్రుతే కాదు శ్రీ శ్రీ స్తుతి కూడాను.

'అల నన్నయకు' లేదన్నది ఆత్మస్తుతి కాగా 'అల... విశ్వనాథకు లేదన్నది పరస్తుతి, అంటే పరులు చేసిన స్తుతి. ఆత్మస్తుతిలో పడగలుగా విప్పారు కొన్న 'అహం' పరస్తుతిలో ముడుచుకొని చుట్టగా, పుస్తకమట్లు, పండుకొనిన శేషునివలె, నిద్రాణమై శోభిల్లుతోందా అనిపిస్తోంది. 'వేయిపడగలు' చదివి 'అన్నీ పడగలే పామెక్కడా లే'దన్నారట అబ్బూరివారు.

అహం గురించి ముచ్చటిస్తూ పడగల్లో పడ్డాం. అందుకే అంటారు 'ముదిమికి నిదానం తక్కువ' అని.

'కన్యాశుల్కం' నాటకంలో హవల్దారు అచ్చన్నగార్ని మంచి 'గ్యాని' గా పరిచయం చేస్తాడు దుకాణదారు. (బైరాగి... సీనులో) సమాజంలో జ్ఞానుల్ని వేళ్ళమీద మాత్రమే లెఖ్ఖ పెట్టగలం. వీరి విజ్ఞాన కవాక్షాల్లోంచి కూడా 'అహం' అప్పుడప్పుడు తొంగి చూస్తూనే ఉంటుంది. ఎల్లాగంటే... డెబ్భైఏళ్ళ క్రితం నాటి మాట. రాజమండ్రిలో ద్వారం మెకటస్వామి నాయుడి గారి వయొలిన్ కచేరీ. వారు ఫిడేల్ వాద్యులుగా విశ్వవిఖ్యాతులు. ఊరి పెద్దలుగా విస్సాఅప్పారావుగారూ, జయంతి సత్యనారాయణ గారూ ఆహ్వానితులై, ముందు వరుసలో ఆసీనులయ్యారు. వీరిద్దరూ స్థానిక ప్రభుత్వ కళాశాలలో (Govt. Training college ) ప్రిన్సిపాల్సు గా చేసి రిటైరయిన వారు. ఇరువురూ మేధావులే! అందునా అప్పారావుగారు, వెరసి, సంగీతజ్ఞులుగా సుప్రసిద్ధులు.

కచేరీ మాంఛి పట్టుగా సాగుతోంది. నాయుడుగారు రాగం వాయించారు. 'ఈ రాగం ఏమిటండీ?' అని అప్పారావుగార్ని సత్యనారాయణగారడిగారు. అప్పారావుగారు లిప్తమాత్రం తమాయించుకొని, క్రీగంట ఇరుపక్కాలా వీక్షించి, తలపంకిస్తూ 'మణిరంగు' అనుకుంటా' అన్నారు. ధాటీగా 'మణిరంగు' అని అనలేదు. అంటే పూర్తిగా నమ్మకంలేదన్న మాటే కదా! 'ప్రసూదోధీమతామపి' ఎంతటివారైనా పప్పులో కాలెయ్యొచ్చు కదా! అహం తొంగి చూడడమంటే ఇదే కదండీ.... 'నాకు తెలియదు' అనేస్తే మనం ఇంతగా ముచ్చటించుకో వలసిన అవసరం ఉండేది కాదు !

ఇల్లాంటి ఇబ్బంది మనకీ కలుగుతూనే ఉంటుంది. కచేరీ లో నన్ను చూడగానే 'రండి...రండి' అంటూ పల్కరించి, పక్కసీటులోకి ఆహ్వానిస్తూ ఉంటారు మిత్రులు, రావుగారు. మొదటి అయిటమ్ (item) ప్రారంభం కాగానే 'ఈ రాగం ఏమిటండీ?' అని అడుగుతారు. 'తెలియదు' అనగలిగే అనహంకార స్థాయికి ఇంకా ఎదగనందున యథాశక్తి చెప్తూనే ఉంటా! ఈయన పిడికిట్లో ఎప్పుడో ఒకప్పుడు మిడతంభొట్లు లాగ చిక్కుతానేమో అన్న బెంగ పీడిస్తూనే ఉంటుంది. ఆయన కూడా నేనెప్పుడు పప్పులో కాలేస్తానా - అని ఎదురుచూస్తూ ఉంటారని - నాఅనుమానం.

సంగీత, కచేరీలూ అంటే డిసెంబరు నెలలో ఏటా మద్రాసు (చెన్నై) లో జరిగే సంగీతసభల గురించే చెప్పుకోవాలి! చెన్నైలో చిన్నా, పెద్దా ఏభైకి పైగా శాలలున్నాయట. అన్నింటిలో ఏకకాలంలో (Simultaneousగా) కచేరీలు జరుగుతూ ఉంటాయి. మ్యూజిక్ అకాడమీ (T.T.K సభ), నారదగాన సభ లాంటి శాలల్లో వేయికిపైగా అభిమానులు ఆసీనులై ఉంటారు. అన్నేటి పట్టుచీరల తళతళలూ, రవ్వదుద్దుల ధగధగలూ, `under single roof` చూడాలంటే ఇంతకు మించిన అవకాశం దొరకదు. కళాభవన్ లాంటి మధ్యరకం సభల్లో ముందువరుసలో సీట్లు దొరికితే గాయకునితో కక్ష్య స్పర్శకు (eye contact) అవకాశం ఉంటుంది. అదొక అపూర్వానుభూతి!

సంజయ సుబ్రహ్మణ్యంగారి కచేరి ముందు వరుసలో సీట్లు దొరికాయ్. ఎత్తుకోడం తోటే ఉత్సాహం పెల్లుబుకుతూ ఉంటుంది. Warning period ఉండదు. చక్కని శారీర సంపదతో గాత్రసంపద మేళవింపు. సభ రక్తి కట్టడానికి ఇంతకంటె ఏం కావాలి? మొదటి వర్ణం అవగానే 'సెభాష్' అనేశాను - చిన్నగానే - చివ్వున చిరునవ్వు విసిరారు. నాలోని అహంకారం చిగురెత్తింది. సంతువరాళి కృతి తర్వాత స్వరాల్ని చిత్తుచేస్తూంటే ఆ ప్రభంజనంలో ఊగిసలాడుతూ తేలిపోతున్నాను. 'భేష్' అనకండా ఉండలేక పోయాను. ఆయన మళ్ళీ నా వేపు చూసి నవ్వారు! 'నా' లోని 'నేను' 'అరవిరిసిన పువ్వులా' విచ్చుకొంది.

కచేరీకి గరిమనాభి 'రాగం, తానం, పల్లవి' ఘట్టం ముఖ్యంగా రాగాలాపనలో గాయకుని మనోధర్మం శ్రోతల కర్ణేంద్రియాల్ని పెనవేసుకొంటుంది. రాగాలాపన పువ్వులు పువ్వులుగా గుత్తులు గుత్తులుగా పూచిన హేమలతలా సాగుతోంది. 'నా'లో 'నేను' ఎంత మథనపడ్డా, ఆరాగం ఏమిటో అంతుపట్టలేదు ! ముందు వరుసలో కూర్చున్నానే - అందుకు తగుదునా అని కించపడ్డాను. మఱి మదరాసులో సభా .... మజాకానా ఆలాపన పూర్తికాగానే నాకించని పసిగట్టేనట్లు ...రాగం పేరు చెప్పారు! ఆపేరు అపూర్వం. 'మీకే కాదు. చాలామందికి తెలియదు'అనిపించేట్టు చూపుల్తో వీపు తట్టి సముదాయించారు. దాంతో నా అహం 'సోహం'గా పుంజుకొని ఇంతై, అంతై ఆకాశాంచల వీధుల్లోకి నన్ను లాక్కొని పోయింది.

మంగళంతో కచేరీ ముగిసింది. నా పక్కనున్నాయన వెనుక వరుసలోని మహిళని పలకరించి నావేపు కొద్దిగా వంగి. 'ఆమె సంజయ సుబ్రహ్మణ్యం భార్య!' అన్నారు.